క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జీ.సాంబరెడ్డి తెలిపారు. ఇందిరానగర్, భవానినగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, న్యూశాయంపేట సబ్ స్టేషన్ పరిధిలోని సిటిజన్ క్లబ్, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, గ్రీన్‌వుడ్ స్కూల్, ఓరుగల్లు పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో ఉదయం 7.30గంటల నుంచి 11గంటల వరకు, హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 7.30గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



కేయూ క్యాంపస్: ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. ఈమేరకు సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎంసెట్‌లో పదివేల ర్యాంకు కంటే ఎక్కువ వచ్చిన బీసీ విద్యార్థులకు ప్రభుత్వం పూర్తి ఫీజులు చెల్లించకుండా కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాంకులతో సంబంధం లేకుండా ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు పొందిన బీసీ విద్యార్థులందరికి పూర్తి ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అవయవ దాన అంగీకార దాతకు అభినందన



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో హెచ్ఐవీ కౌన్సిలర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కీర్తి సతీష్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా వారిని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ గురువారం అభినందించారు. 13వ జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవయవ దాన అంగీకార పత్రాలను సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రవణ్‌కుమార్‌కు సతీష్‌కుమార్ అందజేశారు.

రేపు గురుకుల టీచర్ల 'చలో హైదరాబాద్'

విద్యారణ్యపురి: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరగనున్న మహాధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు భారత్ బచావో సదస్సు



నయీంనగర్: మణిపూర్ రాష్ట్ర ప్రజలకు అండగా ఉండాలని, ఉమ్మడి పౌర స్మృతిని వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం 10 గంటలకు వరంగల్ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో భారత్ బచావో సదస్సు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా భారత్ బచావో చైర్మన్ డీ.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వ పాలన సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దాన్ని అందరు కలిసికట్టుగా అరికట్టాలని కోరారు. భారత్ బచావో సదస్సులో మేధావులు, విద్యార్థులు, పలు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామబ్రహ్మం, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సు గుట్ట సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా తాడేపల్లి ముగ్గు రోడ్డుకు కొండేటి రవి (33) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గుంటూరు నుంచి వరంగల్‌కు లారీలో లోడు తీసుకొని వచ్చి అనంతరం తిరుగు ప్రయాణంలో ఉర్సుగుట్ట సమీపంలో రోడ్డు పక్కన లారీని నిలిపేసి ఖమ్మం జాతీయ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అతడు మృతిచెందాడు.

నులి పురుగుల నివారణకు 'ఆల్బెండజోల్'



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వరంగల్ డీఈఓ వాసంతి



కరీమాబాద్: ఉర్సు అంగన్‌వాడీ కేంద్రంలో..



మడికొండలోని ఎంపీపీఎస్‌లో..



హసన్‌పర్తి: మాట్లాడుతున్న డాక్టర్ వాణిశ్రీ



బోడగుట్ట ప్రాథమిక పాఠశాలలో..

కాశిబుగ్గ: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులను నివారించవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా 1–19 ఏళ్ల వయస్సు గల వారికి గురువారం మాత్రలు వేశారు. క్రిస్టియన్ కాలనీలోని గ్రెయిన్ మార్కెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వరంగల్ డీఈఓ వాసంతి వేశారు. పాఠశాల హెచ్ఎం నరసింహరావు, కీర్తినగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు అర్చన, ఉపాధ్యాయులు వేణుగోపాలాచారి, తిరుపతి, అనిత, రమేష్, రామనాథం పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో..

కరీమాబాద్: 43వ డివిజన్ మామునూరులోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ, డాక్టర్ మత్తేజ్, డాక్టర్ సఫరా, ఫార్మసిస్టు గ్రేస్, ఏఎస్ఎం సరిత, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్యతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 40వ డివిజన్ ఉర్సు కొత్త కుమ్మరివాడ, ఉర్సు జెండా, కురుమవాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కార్పొరేటర్ మరుపల్ల రవి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అంగన్‌వాడీ టీచర్లు సునీత, సుజాత, వెంకటమ్మ, ఏఎస్ఎం అనిత, హెల్పర్లు అనిత, రహీమున్నీసా పాల్గొన్నారు.

మడికొండ ప్రాథమిక పాఠశాలలో..

మడికొండ: మడికొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం రోజీ, ఎస్ఎంసీ మెంబర్ బొగిని నాగరాజు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య, సీఆర్పీ రేణుక, ఉపాధ్యాయులు రమేష్, రాజేశ్వరి, అరుణ, వేణుగోపాల్, యశోద, హైమవతి, కమల, సిబ్బంది కిషన్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాణిశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోడగుట్టలో..

కాజీపేట రూరల్: 47వ డివిజన్ బోడగుట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. సోమిడి సెంటర్ సూపర్‌వైజర్ డీ.కవిత, ఆశ వర్కర్ యాకూబీ, ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి



ఆట వస్తువులను అందజేస్తున్న పూజ

మామునూరు: ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) తెలిపారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకొని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనిధి శర్మ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుభాషిణి పర్యవేక్షణలో రూ.90వేల వ్యయంతో చేసిన అభివృద్ధి పనులను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్ర విజయ్‌కుమార్, డీఎస్పీలు భిక్షపతి, శ్రీనివాస్, పాండునాయక్, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, సీఎల్ఐ నరేష్, ఇన్‌స్పెక్టర్లు వడ్డె నరేష్, అశోక్, ఏఎల్ఐ రాజన్ బాబు, సత్యనారాయణ, సుధాకర్, ఆర్ఎస్సై దశరథం, పీఈటీ రామాచారి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాల ఆవశ్యకతపై అవగాహన



ముర్రుపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: అప్పుడే జన్మించిన శిశువు నుంచి ఆరు నెలల వరకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని తల్లులకు ఐసీడీఎస్ హనుమకొండ సూపరింటెండెంట్ విజయలక్ష్మి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బాలింతలకు ముర్రుపాల ఆవశ్యకతపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజ్యలక్ష్మి, కవిత, రమాదేవి, వనజ పాల్గొన్నారు.

పేదలకు చేయూతనందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

కాజీపేట: బడుగు, బలహీన వర్గాలకు సహాయ, సహకారాలు అందించడానికి లయన్స్ క్లబ్ సభ్యులు సిద్ధంగా ఉండాలని అంతర్జాతీయ డైరెక్టర్ జీ.బాబురావు పిలుపునిచ్చారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని పీజీఆర్ గార్డెన్‌లో కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రూ.60 లక్షల వ్యయంతో 40 బాడీ ఫ్రీజర్లు, 2వేల స్కూల్ బ్యాగులు, 400 సిమెంట్ బెంచీలు, 10వేల నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గీగల మోహన్‌రావు, నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ వంగాల గోపాల్ రెడ్డి, జిల్లా గవర్నర్లు కన్నా పరశురాములు, డాక్టర్ ముచ్చు రాజిరెడ్డి, కటంగూరి రాంగోపాల్ రెడ్డి, పెండం వేణుమాధవ్, నెల్లుట్ల రమాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మేకల రమేష్



హన్మకొండ: బీసీ ఐక్య సంఘర్షణ సమితి అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మేకల రమేష్‌ను నియమించినట్లు బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిళి తెలిపారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

'స్కై యాజమాన్యం'పై చర్య తీసుకోవాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: ఎలాంటి అనుమతులు లేకుండా హనుమకొండ భీమారంలో తరగతులు నిర్వహిస్తున్న స్కై స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్కై స్కూల్ యాజమాన్యం దిష్టిబొమ్మను హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా స్కై స్కూల్ పేరుతో పాఠశాల నడుపుతున్నా జిల్లా విద్యాశాఖాధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు రాకేష్, యశ్వంత్, సాహిత్, అభిలాష్, రాకేష్, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు అలంకరణ సేవ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని దక్షిణ ముఖ అభయాంజనేయస్వామికి గురువారం తమలపాకులతో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి



సరుకులు పంపిణీ చేస్తున్న రాజేందర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ దీన్‌దయాళ్ నగర్‌లోని వరద బాధితులకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. డివిజన్ అధ్యక్షుడు వల్లెపు వేణు, రాజు, శివరాత్రి వెంకటేష్, గణేష్, దేవేందర్, లక్ష్మణ్, అభిషేక్ పాల్గొన్నారు.

ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి


రామన్నపేట: నగరం నీట మునిగాక ప్రజలకు సూచనలు ఇవ్వడం తప్ప.. ముంపు ప్రాంత ప్రజలను మాత్రం ప్రభుత్వం ఆదుకోవడం లేదని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. 29, 11వ డివిజన్లలో సుమారు 400 బాధిత కుటుంబాలకు విశాల్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాసరావు, బుద్ధ లత, పూర్ణ, సంగీత్, గోల్కొండ సదానందం తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యమే వరదలకు కారణం


కాశిబుగ్గ: బీఆర్ఎస్ పాలకులు, స్థానిక ఎమ్మెల్యే, అధికారుల నిర్లక్ష్యమే నగరంలో వరదలు రావడానికి ప్రధాన కారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆరోపించారు. ముంపు ప్రాంతమైన గాంధీనగర్‌లో గురువారం ఆయన పర్యటించి బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంతెన అమరీష్, కందిమళ్ల మహేష్, మంద శ్రీనివాస్, మేరుగు ప్రకాష్, గూడూరు కృష్ణ, కిషన్, అమర్, రంజిత్, సతీష్, చందు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో..

కాజీపేట రూరల్: వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కాజీపేట ఇందిరమ్మ కాలనీలో ముంపునకు గురై, నిరాశ్రయులైన 109 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులను సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి, కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, కాజీపేట సీఐ సార్ల రాజు అందజేశారు.



దుప్పట్లు అందజేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



సరుకులు పంపిణీ చేస్తున్న డీసీపీ బారి

సంక్షిప్తంగా

స్పెక్ట్రా విద్యార్థులకు అభినందన



హన్మకొండ అర్బన్: వీకే స్పెల్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నగరంలోని స్పెక్ట్రా గ్లోబల్ పాఠశాల విద్యార్థులు.. పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు కే.చర్వి, బీ.వరుణ్‌దత్త, హర్షిణి, ఆరాధ్య, యశస్వి, హద్వితారెడ్డి, హస్మిక, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్నదానం

కాజీపేట రూరల్: హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్ ఎదుట 150మందికి గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నార్థులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, రామ్, సుధాకర్, రెడ్‌క్రాస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్లకు సన్మానం

హన్మకొండ అర్బన్: నగరంలోని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ స్వగృహానికి పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి, నాయకుడు జక్కు రాకేష్ గురువారం వచ్చారు. ఈ సందర్భంగా వారిని ఆకుల రాజేందర్ దంపతులు, టీఎన్జీవోస్ జిల్లా బాధ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బోనాల మాధవి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, లక్ష్మీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్ క్రైం: పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.58,575 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి నిందితులు కేఎల్ఎన్ రెడ్డి కాలనీకి చెందిన మాదాటి శ్రీరాంరెడ్డి, హనుమకొండకు చెందిన మేక మోహన్ రెడ్డి, మద్దిరెడ్డి సాగర్‌రెడ్డి, కొత్త దేవేందర్‌రెడ్డి, గూడూరు కమలాపూర్‌కు చెందిన అంకతి సాంబయ్య, నయీంనగర్‌కు చెందిన కొలసాని వీరారెడ్డి, కమలాపూర్‌కు చెందిన వలిగె సాంబరావును అరెస్టు చేసి తదుపరి చర్యల కోసం సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై నరసింహరావు పాల్గొన్నారు.


సాయిబాబా మందిరంలో కంటి వైద్య పరీక్షలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ బస్టాండ్ రోడ్డులోని షిర్డి సాయిబాబా మందిరంలో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. శరత్ మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో 114 మందికి ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహేష్, దివ్య, ప్రశాంత్, ఏసీపీ విజయకుమార్, ఆలయ చైర్మన్ హరగోపాల్, ధర్మకర్తలు శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ తల్లి తొట్ల లచ్చమ్మ మృతిచెందారు. మడికొండలో బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, రంగనాథ్, రొండి రాజు, సుంచు చంద్రయ్య, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కట్కూరి రమేష్, గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్, సందెల విజయ్, వస్కుల శంకర్, బైరి లింగం, మెరుగు రాజయ్య, బిళ్లరవి, బండి రాజు, బైరబోయిన రమేష్, నీలం వేణు, వస్కుల శ్రీను, దొంగల కుమార్, నవీన్, నాగేష్, ప్రవీణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందిన బైక్ మెకానిక్ కడారి శ్రీనివాస్ కుటుంబానికి హనుమకొండ టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.పది వేలను గురువారం అందజేశారు. కిషన్‌పురలోని మృతుడి నివాసంలో బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దోజు వెంకటాచారి, అసోసియేషన్ హనుమకొండ ప్రెసిడెంట్ షాకీర్, కోశాధికారి శ్రీనివాస్, సంఘం బాధ్యులు మహేందర్, చీకటి శ్రీనివాస్, హైమద్, అంజద్, మెకానిక్ జాఫర్ పాల్గొన్నారు.

వ్యవసాయ రుణమాఫీపై హర్షం

రైతులకు ప్రభుత్వం రూ.లక్ష వ్యవసాయ రుణమాఫీ ప్రకటించడంపై బీఆర్ఎస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, రైతు బాంధవుడని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



దేశాయిపేట: ఆరెపల్లిలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



హసన్‌పర్తిలో..



వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో..



కాజీపేట చౌరస్తాలో..



కరీమాబాద్: తిమ్మాపురంలో..



హనుమకొండ హనుమాన్‌నగర్‌లో..

పేదల స్థలాలు అమ్ముకుంటున్న నాయకులు



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

వరంగల్: గ్రేటర్ వరంగల్‌లోని 12వ డివిజన్ దేశాయిపేట్‌లోని నందూరి ప్రసాద్‌రావు(ఎన్పీఆర్)నగర్ లక్ష్మి మెగా టౌన్‌షిప్ పక్కన గుడిసెలు వేసుకున్న పేదల స్థలాలను స్థానిక కార్పొరేటర్ అండతో కొంత మంది నాయకులు అమ్ముకుంటున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నేతలు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంట రవి, కుసుమ సతీష్ ఆరోపించారు. ఈమేరకు ఎన్పీఆర్‌నగర్‌ను నాయకులు గురువారం సందర్శించి బాధితులు రామకృష్ణ, రుద్రోజు కృష్ణవేణి, మెట్టిన జీవన్, ఎండీ.ఖాసీం, పావని, జ్యోతిని పరామర్శించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ అండదండలతో స్థానిక నాయకులు కమిటీని ఏర్పాటు చేసుకొని అమాయకులైన పేదలను మోసం చేసి గుడిసెలకు తాళాలు వేసి బెదిరించి ఖాళీ చేయించి వేరే వాళ్లకు డబ్బులు తీసుకుని అప్పగిస్తున్నారని విమర్శించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కనకుంట్ల రంజిత్, వెంకటేష్, మాదాసు రాజు, తాబేటి వెంకట్‌గౌడ్, రాజు, బోడ విజయ్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, నైనేష్ పాల్గొన్నారు.

నాసాకు ఎంపికైన 'శ్రీచైతన్య' ప్రాజెక్టు



ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నాసాకు ఎంపికైంది. 2022 –2023 విద్యా సంవత్సరానికి నాసా ఎంపిక చేసిన ప్రాజెక్టుల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి పొందింది. ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్న హవిష్మతి, హసత్ర, సాయి మన్విత్‌రెడ్డి, వినీత్, కృతిక్, రుత్విక్, నిహాల్ రెడ్డి, అక్షయలక్ష్మికి నాసా బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందించింది. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను శ్రీచైతన్య పాఠశాల జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేఖ, బాషా, ఇన్‌చార్జ్‌లు ఉదయభాస్కర్, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.